# అనుమానం!

శ్రీమతి వఝ్ఝల లక్ష్మీనరసమ్మ

"ఇంకా వంటయిందా లేదా?" అన్నాడు వెంకట్రావు.

"అయింది. మీరు స్నానం చేయండి" అంది రమణమ్మ.

భోజనం చేస్తూవుండగా, వీధి తలుపు చప్పుడయింది. రమణమ్మ లేచి తలుపు తీసింది. పొరుగు కృష్ణారావు కనిపించి "ఏం చెల్లెమ్మా? బావగారి భోజనం అవుతున్నదా" అన్నాడు.

"రావోయి కృష్ణా! కూర్చో" అని కేకవేశాడు వెంకట్రావు - మనసులో విసుక్కుంటూ, అయిష్టతతో.

గోడ గడియారం పదిగంటలు కొట్టింది. "వుత్తినే వచ్చానోయ్! నాకూ టైమయింది. వెళ్తాను" అంటూ కృష్ణారావు వెళ్ళిపోయాడు.

వెంకట్రావు భార్యమీద రుసరుసలు ఆడుతూనే భోజనం ముగించాడు . . . . . .

♦ ♦ ♦

కృష్ణారావు యింటికివచ్చి, సుబ్బలక్ష్మితో "వేగిరం భోజనం వడ్డించు" అన్నాడు.

"మీకు భోజనం ఎందుకండీ! ఆ రమణమ్మ ముఖం చూస్తూ కూచుంటే చాలదూ?" అంది సుబ్బలక్ష్మి వెటకారంగా.

"ఛీ! వూరుకో! సోదర ప్రేమతో మేము ఒకరినొకరం చూచుకుంటున్నాము. అలా అనడం తప్పు!"

"ఓహోహో! మీ సోదర ప్రేమలు నాకు తెలుసులెండి! పైకి పటారం, లోన లొటారం."

♦ ♦ ♦

ఈ రెండు కుటుంబాల సంగతి ఇలా వున్నది. వెంకట్రావుకి భార్యమీద అనుమానం! సుబ్బలక్ష్మికి భర్తపై అనుమానం.

ఇలా వుండగా, ఓనాడు — రమణమ్మ పండుగకని తన పుట్టింటికి వెళ్ళింది. వెంకట్రావుకి మనస్సు హాయిగావుంది! ఇవతల సుబ్బలక్ష్మి మనస్సుకూడా కొంత తేలిక అయినట్లుంది. వెంకట్రావు, కృష్ణారావుల స్నేహం సాఫీగానే నడుస్తున్నది.

ఒక వారం గడిచింది. పొరుగూరిలో తన తమ్ముడివద్దకి ఏదోపనిమీద వెళ్ల వలసివచ్చింది కృష్ణారావుకి! అంచేత "ఒసే, రేపు వుదయం 5 గంటలకే కాఫీ చేయాలి" అన్నాడు భార్యతో.

వచ్చిన చిక్కేమిటంటే, ఆ పొరుగూరే రమణమ్మ పుట్టిల్లు! దీంతో సుబ్బలక్ష్మికి అనుమానం ఎక్కువైంది!

"మీ పనులు ఏమిటో నాకు తెలుసు! ఈ వారం రోజులూ, ఆవిడగారు లేకపోవడం వల్ల మీరుండలేకపోయారు!" అంది ఆమె!

ఏమైనా కృష్ణారావు వెళ్లిపోయాడు.

ఆమర్నాడు నూతి దగ్గర సుబ్బలక్ష్మి నీళ్లు తోడుతూ వుండగా వెంకట్రావు వచ్చాడు.

"కృష్ణ ఈ మధ్య కనిపించడంలేదేం" అన్నాడు వెంకట్రావు.

"మీ ఆవిడ పుట్టింటారి వూరు వెళ్లేరు! అక్కడ మా మరిదిగారువున్నారులెండి" అంది సుబ్బలక్ష్మి ఏదో సూచనగా!

వెంకట్రావు వూరుకున్నాడు. ఇద్దరూ ఏదో ఆలోచించుకుంటూ చాలా సేపటి వరకూ అట్లానే వుండిపోయారు. ఇద్దరికీ అనుమానాలువున్న సంగతి ఇద్దరికీ తెలుసును. ముఖచిహ్నాలనుబట్టి ఒకరి ఆలోచనలు రెండోవారు సుళువుగానే గ్రహించుకోగలిగారు! వెంకట్రావుకి కోపంతో వళ్లు మండిపోతున్నది. దీనికి ఏదో వుపాయంచేస్తేకాని లాభంలేదనుకున్నాడు!

"ఏం చెల్లెమ్మా! ఏమిటాలోచిస్తున్నావు"

"మావారెందుకు వూరు వెళ్ళారా అని!"

"ఔను! నేనూ అదే అనుమానిస్తున్నాను" అని వెంకట్రావు తన అనుమానం వ్యక్తంచేశాడు.

సుబ్బలక్ష్మికి కళ్లంట నీళ్లు వచ్చాయి. ఆమె అంది "నా బ్రతుకు యిట్లా అయింది. నా ఖర్మ!"

"చెల్లెమ్మా! వూరుకో! నీ భయం నాకు తెలుసు. నా భయమూ నీకు తెలుసు! దీనికేదైనా వుపాయం మనం ఆలోచించాలి."

సుబ్బులక్ష్మి వుత్సాహంతో "ఔను అన్నగారూ! మీరేదైనా వుపాయం ఆలోచించి నా బ్రతుకు బాగుచేయండి" అంది.

"నా బ్రతుకు కూడాను!" అన్నాడు వెంకట్రావు. ఇద్దరూ ప్లాను వేశారు. ఏమంటే:—

సుబ్బులక్ష్మి పుట్టింటికి వెళ్లినట్లు మొగుడికి వుత్తరం రాయించి, తను మాత్రం నిజానికి ఎదురింట్లో దాగోడం — వెంకట్రావు కూడా తన పెళ్ళానికి 'తను ఏదో ఆఫీసు పనిమీద పొరుగూరు వెళ్తాన' ని రాయించి, నిజానికి పొరుగింటి స్టూడెంట్ల లాడ్జిలో తల దాచుకోడం — ఇదీ ప్లాను! ఈ విధంగా కృష్ణారావు రమణమ్మల ప్రణయకలాపం కనిపెట్టడానికి నిశ్చయించుకున్నారు!

ప్లాను ప్రకారం వుత్తరాలు వెళ్లేయి. ఇళ్లు తాళాలు వేయబడ్డాయి! తాళం చెవులు ఇంటి అధికారుల కిచ్చేరు.

రెండు రోజులు గడిచాయి. ఆ నాటి వుదయం కృష్ణారావువచ్చి, ఇంటివారి దగ్గర తాళాలు పుచ్చుకుని ఇంట్లోకి వెళ్లేడు. పెళ్లాం ఇంత తొందరగా పుట్టింటి కెందుకు వెళ్లిందో! అనుకున్నాడు. ఆ నాటి సాయంత్రం రమణమ్మకూడా పుట్టింటినించి వచ్చేసింది. మొగుడుకి ఎప్పుడూ లేనిది వూరు వెళ్లవలసిన అవసరం ఎట్లా కలిగిందా అని ఆశ్చర్యపడ్డది.

ఇవతల వెంకట్రావు, సుబ్బులక్ష్మి అతి మెలకువతో "నేరస్తులను" కనిపెడుతున్నారు. రాత్రి ఎనిమిదయింది. ఆ వేళ అమావాస్య. చిట్టచీకటి! "ఇది వాళ్ళ అదృష్టం! మా దురదృష్టం" అని అనుకున్నారు డిటెక్టివులు!

రాత్రి 10 గంటలైంది! ఎవరో వ్యక్తి సరిగ్గా కృష్ణారావులాగే వున్నాడు - వరండాలో మెసలుతున్నట్లయింది. మరింకేం! వాడే! రమణమ్మ గదిలోకి దూరడానికి చూస్తున్నట్లుంది అనుకున్నారు డిటెక్టివులు! కాని కటిక చీకటి! ఏదీ సరిగ్గా కనపడటం లేదు. పావుగంట దాటింది. వెంకట్రావు తన రహస్య స్థలంనుంచి సుబ్బులక్ష్మి దాగున్న చోటికివచ్చి రహస్యంగా "చెల్లెమ్మా! దొంగలు దొరికారు. వేగిరం రా! మనిద్దరం మా యింటి వరండాలో నించుని 'దొంగలు, దొంగలు' అని అరుద్దాం, అందరూ వస్తారు!" అన్నాడు. ఆమె వచ్చింది.

ఇద్దరూ వరండావద్దకువచ్చి ఇటు అటూ చూసి గట్టిగా 'దొంగలు దొంగలు' అని అరవ ప్రారంభించారు. 2 నిమిషాల్లో రెండు డజన్లమంది పరుగెత్తుకునివచ్చి వరండాలో గుమికూడేరు.

"ఎక్కడున్నారు దొంగలు" అన్నారొకరు.

"ఆ యింట్లో" అని వెంకటరావు తన ఇంటివేపు చూపించాడు!

అందరూ ఆ యింటి తలుపులు బాదడం మొదలు పెట్టేరు. ఇంతలో భయంతో వణకుతూ రమణమ్మ తలుపులు తెరిచి బావురుమంది! వెంకట్రావు గబగబా లోప

లికివెళ్లి ఇల్లు అంతా వెతికి పైకివచ్చి సుబ్బలక్ష్మితో మెల్లిగా "అదొక్కర్తే వున్నట్లుంది" అన్నాడు. ఇంతలో ఆ పక్కవాటాగదితలుపు తెరువబడింది. సుబ్బులు, వెంకట్రావు పక్కకి చూశారు! కృష్ణారావు తన గదిలోంచి కళ్లు నులుముకుంటూ అప్పుడే బైటకివచ్చి "ఏమే సుబ్బులూ! నువ్వు ఎప్పుడు వచ్చావు" అన్నాడు వింతగా. చీకట్లో యింతవరకూ తన భర్తని గుర్తుపట్టలేని రమణమ్మ ఇప్పుడు గుర్తుపట్టి "ఏమండీ! ఏమిటీ సంగతి? ఎప్పుడొచ్చారు? ఏవూరెళ్లేరు" అంది.

"ఏవూరూ లేదు. అతను, సుబ్బులమ్మా ఇక్కడే ఎదురింట్లో దాగున్నారు" అని ఎదురింటి కుర్రాడు నవ్వుకుంటూ పారిపోయాడు. అందరూ విస్తుపోయారు.

వెంకట్రావు, సుబ్బులక్ష్మి కొయ్యబొమ్మల్లా ఒకరి నొకరు చూచుకుంటూ అట్లానే నించుండిపోయారు కళ్లుమిటకరించి!!



తన్మయత